# (అ)ప్రయోజకుడు

కొండపల్లి వెంకటరామదాస్.

ఆ రోజు! పెన్షను తీసుకోటానికి పట్నానికి వెళ్ళిన యాజులుగారికి సబ్‌ట్రెజరీలో పని ముగించుకొని, మెడికల్ షాపులో భార్యకు మందులూ టానిక్కులూ కొని, హడావుడిగా బస్‌స్టాండు చేరుకునేసరికి సాయంత్రం 5 గంటలయ్యింది!

అప్పటికే! తమ వూరికి చేరవేసే ఆఖరి బస్సు ప్లాటుఫాం మీద సిద్ధంగా వుంది. నిండు చూలాలిలా ఆ బస్సు ప్రయాణీకులతో కిటకిటలాడుతుంటే, కింద ఎక్కవలసిన ప్రయాణీకులు చాలా మంది మిగిలిపోగా దిగవలసిన ప్రయాణీకులకూ, ఎక్కుతూన్న ప్రయాణీకులకూ మాటల, తోపుళ్ళ యుద్ధాలు జరుగుతూండగా, "చిల్లరలేని వాళ్ళు ఎక్కొద్దు" అంటూ కండక్టరు చేసే కాకిగోల ఆ ప్రయాణీకుల రంధిలో, అరటి పళ్ళు, జంతికలూ, వప్పులూ పువ్వులూ, సోడాలమ్ముకునే కుర్రాళ్ళ అరుపులలో మిళితమయి పోసాగింది.

బ్రహ్మాండం మీద చేతికి దొరికిన కడ్డీ పట్టుకుని లేని సత్తువ తెచ్చుకుని ఆ బస్సు ఆఖరి మెట్టుపై కాస్తంత పాదం మోపగల్గిన యాజులుగారు, ఆ తోపులాటలో బేలన్సు తప్పి పట్టు తప్పి కిందపడ్డారు. ఆ పడటంలో ప్లాటుఫాం అంచుకు తన బట్ట బుర్ర తగిలి సొమ్మసిల్లిపోయే పరిస్థితిలో, అదృష్టవశాత్తూ! "పాపం! పెద్దాయన" అనుకుంటూ యాజులుగారి దీనావస్థకు జాలిపడి, కదలబోతూన్న బస్సులోకి లాఘవంగా చేయూత నిస్తూ లోపలకి లాగుకున్నాడు ఎవరో ఒక పుణ్యాత్ముడు.."దెబ్బ తగిలిందా! మాష్టారూ?" అంటూ

"యిలాంటి దెబ్బ లెన్నో తిని వున్న ఘటం నాయనా" అని మనస్సులో అనుకున్న యాజులుగారు. కంపిత స్వరంతో తన కృతజ్ఞతలు తెలుపుకున్నారు. కాస్త తేరుకున్న యాజులుగారి, పైకడ్డీ పట్టుకుని వణుకుతూన్న తన శరీరాన్ని అదుపులోకి తెచ్చుకుంటూన్న తరుణంలో తన చేతి సంచీ లేనట్టు గుర్తుకు వచ్చింది.

ఇదేమీ పట్టించుకోనట్టు స్పీడందుకున్న ఆ బస్సు పట్న పొలిమేరలు దాటుతూంది అప్పుడే!

"అయ్యో!య్యో! నా సంచీ! నా సంచీ! కనపడ్డంలా! కండక్టరు బాబూ! కాస్త బస్సు ఆపించు నాయనా!నీ పుణ్యముంటుంది" అంటూ అరచి గీపెడుతూన్న యాజులుగార్ని తీక్షణంగా చూస్తూ వెనక నుంచి టిక్కెట్టు కొడుతూ ప్రయాణీకుల సమూహంలోంచి చొచ్చుకుని ముందు కొస్తూన్న కండక్టరు యిలా గద్దించాడు.

"అయ్యా! మేష్టారు గారూ! యిది ఎక్కడ పడితే అక్కడ ఆగే ఎద్దుల బండి కాదు సార్! మా సర్వీసు ప్రజాసేవకే అంకితం. అందుకు సాక్ష్యం – అవిగో తాటికాయంత అక్షరాల్లో– మీ సామాన్లు భద్రత మా బాధ్యత కాదు. ముందు టిక్కెట్టు తీసుకొండి సార్!"

బస్సులో చిల్లర లేకపోతే యిబ్బందన్న ముందు జాగ్రత్తలో అంతకు ముందు అరటి పళ్ళ అంగడిలో యిచ్చిన 5 రూపాయల బాపతు చిల్లరొక్కటే జేబులో భద్రంగా మిగలటంతో యాజులుగారు కుదుటబడి, గత్యంతరం లేక టిక్కెట్టు తీసుకోక తప్పలేదు.

తన దయనీయ స్థితికి యాజులు గారికి కళ్ళల్లో నీళ్ళు దిగినాయ్! ఏ నెల కానెల వచ్చే పెన్షను రాళ్ళతో చాలీచాలని జీవితాలు వెళ్ళమారుస్తూన్న తమ రెండు జీవితాలకు. తన పెన్షన్ జీతం పోయినందుకు బాధ కంటే, ముప్పై ఏళ్ళు తనకు చేదోడువాదోడుగా వుండి, కష్టసుఖాల్లో సమానంగా పాలుపంచుకొంటూ, శారీరకంగా దీలాపడ్డ తన భార్యకు కొన్న మందులు కూడా ఆ సంచీలోనే వుండిపోయాయ్ అన్న తలంపు ఆయన మనసును మరింత క్షోభించసాగింది!

పక్క స్టాపులో దిగబోతూ, దయతల్చి, "పెద్దాయన్ని" తన సీట్లో కూర్చోపెట్టి దిగిపోయాడు ఓ ప్యాసింజరు మహాశయుడు.

"అమ్మయ్య! బ్రతికించావ్! నాయనా! వందేళ్ళు బిడ్డా పాపలతో సుఖంగా వుండు!" అంటూ మనసులోనే అతన్ని దీవిస్తూ సీటులో జారగిలబడ్డ యాజులుగారికి, గత జీవితం కళ్ళ ముందు ప్రత్యక్షమైంది

* * * * *

యాజులుగారి పూర్తి పేరు సోమయాజులు. అంటే యజ్ఞయాగాదులు చేసి సంపాదించుకున్న పేరు మాత్రం కాదు సాక్షాత్తూ తన తాతగారి పేరున తనకు సంక్రమింపబడిన నామధేయం అది!తన తండ్రి భానుమూర్తి కాస్త గౌరవ ప్రతిష్ఠలు కల కుటుంబానికి చెందిన వాడు సుక్షేత్రమైన 35 ఎకరాల మాగాణీ, పెద్ద దివాణం లాంటి భవనం, పాడీపంటా సమృద్ధిగా గల వంశం తనది– తనకి అయిదేళ్ళు వచ్చే సరికే అకస్మాత్తుగా తల్లి చనిపోయింది."

చిన్నతనం నుంచీ గారాబంగా పెరిగిన తన తండ్రి భానుమూర్తికి యీ ప్రపంచంలోని వ్యసనాలన్నీ సంక్రమించినా – అదే సమయంలో కొడుకు ప్రవర్తనకు దిగులుతో మంచ మెక్కిన తాతగారు కూడా దివంగతులవటంతో, భానుమూర్తికి పట్టపగ్గాలు లేకుండా పోయాయ్! పట్నాలలో గుర్రప్పందాలు, జూదాలు వగైరా విలాస జీవితాల కలవాటు పడిపోయిన తన తండ్రి యింటి పట్టున వుండటమే గగనంగా వుండేది. నౌకర్లూ చాకర్లే తన ఆలనాపాలనా చూచుకునేవారు. ఎప్పుడైనా ఇంటికొచ్చే వేళల్లో తనని దగ్గరకి తీసుకుంటూ, వద్దన్నా వినకుండా –"పోకెట్‌మనీ వుంచుకో బాబూ! బాగా చదువుకో!" అంటూ జేబులో చెయ్యి పెట్టి చేతికొచ్చిన నోట్లు కొడుకు జేబులో పెట్టేవాడు భానుమూర్తి.

కాని! యాజులు తండ్రి యిచ్చిన డబ్బు మాత్రం జాగ్రత్తగా కిడ్డీ బాంకిలో దాచుకుంటూ, చదువు సంధ్యల మీద అపారమైన శ్రద్ధ చూపుతూ స్కూలు పైనలు పరీక్షలో స్కూలంతటికీ ఫస్టున పాసయ్యాడు.

అనుకోని ఓ హఠాత్తు పరిణామం తన బాల్య జీవితాన్ని ఓ విచిత్రమైన మలుపు తిప్పేసింది. గుర్రప్పందేలకని మదరాసు వెళ్ళిన భానుమూర్తి గారికి బదులు ఆయన శవాన్ని ఒకరోజున యింటికి చేర్చారు భృత్యులు. అసరికే!పూర్వీకులిచ్చిన ఆస్థి తన వ్యసనాలకు హారతి కర్పూరంలా కరిగిపోతూంటే పట్టించుకోకుండా, మిగిలిన లంకంత యింటినీ ఏభై వేలకు ఫణంగా పెట్టి ఆఖరి సారిగా "హార్సు కోర్సు" వెళ్ళిన తన తండ్రి, ఆ పందేల్లో సర్వస్వం ఓడిపోయి, ఉన్న ఒక్క కొడుకునూ గాలికి వదిలేసి, నిత్యం తను తాగే మందులో మరో మందు కలుపుకుని తన వ్యర్థ జీవితానికి స్వస్తి పలికేశాడు తన తండ్రి

యీ సారాంశం నౌకర్ల వల్ల విన్న తన కాపిపత్కర పరిస్థితుల్లో ఏమి చేయాలో తోచని నిస్సహాయ స్థితిలో తన తండ్రి శవం మీద పడి భోరున ఏడ్వసాగాడు తను

ఊర్లో పెద్దలందరూ చేరి తనని సముదాయించి కర్తవ్యం బోధించారు. ఆ క్షణంలో తనకి తండ్రి యిచ్చిన "పోకెట్‌మనీ" గుర్తుకొచ్చి, బాంకిలో జమ చేసింది వడ్డీతో సహా డ్రా చేస్తే ఆరు వేల పైచిలుకే వచ్చింది దాంతో! కరణంగారి సలహాతో తండ్రికి చేయాల్సిన కర్మకాండలు సవ్యంగానే జరిపించేశాడు యాజులు

తండ్రి చనిపోయిన పదిహేను రోజులకే, బేటామీన్‌తో మార్వాడీ సేట్ వచ్చి, తరతరాలుగా మిగిలిన ఆ భవనాన్ని స్వాధీనం చేసుకోవటంతో, పూవులమ్మిన వూళ్ళో కట్టెలమ్మలేక, గత్యంతరం తోచక, తన స్కూలు సర్టిఫికెట్లు, నాలుగు దుస్తులూ, ఓ సంచీలో సర్దుకుని, తండ్రి కర్మకాండ చేయగా మిగిలిన రెండు మూడు వందల రొక్కంతో రైలెక్కాడు గమ్యం తెలీని తను!

అలా! పట్నం చేరిన తను వాళ్ళ కాళ్ళూ, వీళ్ళ కాళ్ళూ పట్టుకుని మెల్లగా టీచరు ట్రైనింగు స్కూల్లో చేరి, వారాలు చేసుకుంటూ, వీధి లైట్ల

వెలుతుర్లో పరాయి పంచన చదువు కొనసాగిస్తూ, సెకండరిగ్రేడు టీచింగు సర్టిఫికెట్టు, మెరిట్‌తో ప్యాసయ్యాడు అట్టే శ్రమ పడకుండా కేవలం ప్రతిభతోనే జిల్లాపరిషత్తు వారి ధర్మమా అని టీచరు వుద్యోగం సంపాదించగలిగేడు అనతికాలంలో నే తను

ఆ దొరికిన ఆధారాన్ని పట్టు సడలించకుండా, స్థిర నిశ్చయంతో, కొత్త జీవితానికి నాంది పలికించుకున్నాడుతను అలా వృత్తి రీత్యా'వూళ్ళూ, గ్రామాలూ తిరుగుతూ అయిదేళ్ళు గడిచేసరికి తన యిరవై అయిదవ ఏట, తన జీవితంలోకి ఓ సామాన్య మధ్యతరగతి కుటుంబీకురాలైన సుగుణమ్మ తన జీవిత భాగస్వామినిగా ప్రవేశించింది ఆమె కూడా' వున్న దాంట్లోనే గుట్టుగా సంసారం గడుపుతూ, తన కష్టసుఖాల్లో సమానంగా పాలుపంచుకొంటూ దొడ్డ యిల్లాలుగా సేవ చేస్తూ వచ్చింది

అయితే' తమకు చాలా రోజుల వరకూ సంతానం కలుగలా, తీరా తమ పెళ్ళయిన పదేళ్ళకి సుగుణమ్మ కడుపు పండింది కాని' ఆ ఫలాన్ని అందించటంలో ఆమె విఫలురాలు కావటంతో సిజేరియన్ ఆపరేషన్ సాయంతో అతికష్టం మీద ఆమె మగబిడ్డను కన్నది దైవికంగా' తల్లీబిడ్డా బతికి బైటపడ్డార్లు గాని, ఆమె శాశ్వతంగా సంతాన యోగానికి దూరమవక తప్పలేదు లేకలేక తన కడుపు చించుకుని పుట్టిన కొడుకును "సుకుమార్" అని పిలుచుకుంటూ అతి సుకుమారంగా పెంచసాగింది, అంత కాలానికి తల్లి ననిపించుకున్న యాజులుగారి భార్య సుగుణమ్మ

"యాజులు మాష్టారు" అంటే కుర్రాళ్ళందరికి సింహస్వప్నం ఆయన పాఠాలు చెప్తుంటే మంత్రముగ్ధుల్లా వుండిపోయే వారు విద్యార్థులు. నిశ్శబ్దంగా' ఆనాటి తన విద్యార్థుల్లో ఎందరో యీనాడు ఉన్నత శిఖరాల నందుకున్నారు తనని ఆదర్శ ఉపాధ్యాయుడిగా సన్మానించారు

కాని' తన ఒక్కగాని ఒక్క కొడుక్కి చదువు మీద శ్రద్ధ కల్గించలేకపోయిన అసమర్థుడుతను వాడికి చదువు మీద కంటే, ఆటపాటల్లోనే ఆసక్తి చూపించటంతో యాజులు మేష్టారుకి తన తండ్రి గుర్తు కొచ్చేవాడు వెంటనే వెర్రి ఆవేశం పుట్టుకొచ్చేది ఆ కోపంలో కన్నకొడుకని



# దీపికలు

యువతరం! యువతరం!! యువతరం!!
ఉర్వికే ఆధారం యువతరం
చిన్నం తరానికి – పెద్దం తరానికి
తర తరానికి – ఏ తరానికైనా
ఆధారం యువతరం

అలనాడు స్వాతంత్ర్య సమర
సంగ్రామంలో సారధి యువతరం
దేశమాత దాస్య శృంఖలాల్ని
చేదించింది యువతరం
అలనాటి యువతరం

క్రమశిక్షణకు, కార్యసాధనకు
నీతికి నిజాయితికి ప్రతీక
నైతిక పోరాటాలకు న్యాయమైన మార్గాలకు
ఆల వాలం – అదొక మహాలయం
ఈనాటి యువతరం

కలుషిత ప్రభంజనంతో ప్రజ్వలిస్తున్న
మహానలం!
అనుకొంటె – ఈ మహానలం
అలజడుల్ని, అరాచకాల్ని
సజీవంగా దగ్ధం చెయగులుగుతుంది
మరి ఏ అదృశ్యభూతం ఆవహించిందో
ఏ స్వార్థ పూరిత హృదయం ప్రేరేపించిందో
బస్సులు తగల బడుతున్నాయి
రైళ్ళు దగ్ధమవుతున్నాయి
విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో
సోడా బుడ్లు సైకిలు చైన్లు ఆడుకొంటున్నాయి
వర్గ పర ద్వేషమ్యాలు
వయ్యారాలు వొలక పోస్తున్నాయి
గురు కులాలు కురుకుల సంగ్రామ క్షేత్రాలైనాయి

ఆనాటి యువతరం – ఈ దేశాన్ని
ఈ యువతరం చేతికిస్తే – ఈ యువతరం దేశాన్ని
కోతి చేతి పూమాలగా చేస్తున్నది!
విద్రోహక చర్యలతో విర్రవిగే ఈ యువతరం

గుండెల్లో విజ్ఞాన దీపికలు వెలిగించి
మనిషి మనిషిగా బతకడానికి
మానవుని మనుగడ సుఖప్రదం కావడానికి
దోహదం చేస్తే – అదే దేశ ప్రగతి!
నేను గళ మెత్తి ఆలాపించే ప్రబోధ గీతి!

–కుమారి కె. కుమారి

# "(అ)ప్రయోజకుడు!"

ఆలోచించకుండా వాడ్ని చిదకబాదేస్తుంటే, సుగుణమ్మగారి మాతృప్రేమ అడ్డు తగుల్తూండేది

"చూడు! సుగుణా! వీడ్ని ముద్దు చేసి పాడు చేస్తున్నావ్! నా వద్ద చదువుకొంటూన్న వీడి యీడువాళ్ళు బాగా చదువుకొంటూ వృద్ధిలోకి వస్తూంటే, వీడిలా రోజురోజుకూ దిగజారిపోతున్నాడు నీ అతి గారాబంతో వీడ్ని వెనకేసుకుని వస్తే, ముందు ముందు మనం చాలా బాధ పడాల్సి వస్తుంది" అంటూ తను హెచ్చరిస్తూండేవాడు

"ఊరుకోండి బాబూ! వాడి కొచ్చే చదువు వాడికెలాగూ రాకపోదు. ఒక్కగాని ఒక్క నలుసునూ గొడ్డును బాదినట్లు బాదితే వీడు కూడా మనకు దక్కడండీ! లేకలేక కల్గిన వీడ్ని నాకు దూరం చేయకండి– మీ మాటకెప్పుడూ ఎదురు చెప్పనిదాన్ని మీకో దండం వీడ్ని నాకు దక్కనివ్వండి!" అంటూ చేతులు జోడిస్తూ తన భార్య ప్రాధేయపడ్తూంటే, ఆ తల్లి హృదయాంత రాళాల్లో నుంచి వస్తూన్న ప్రేమానురాగాలకు అవాక్కయిపోయేవాడు తను

క్రమక్రమంగా! తల్లి యిచ్చిన భరోసాతో, డబ్బులతో చిల్లర తిళ్ళు తింటూ, గోళీకాయలూ, బచ్చాలాటల్తో చదువు సంధ్యల జోలికి అట్టే వెళ్ళేవాడు కాదు తన కొడుకు "సుకుమార్"!

ఎలాగో! బొటాబొటే మార్కులతో పదవతరగతికి వచ్చేడు సుకుమార్ పబ్లిక్ పరీక్షల్లో కాపీ కొడ్తూన్న కొడుకుని పట్టుకుని డిబారు చేశారన్న వార్త విన్న తనని, తన తండ్రి మరణం ఆస్తి పోవటం, వీటన్నింటినీ మించి కలచి వేసింది ఇదిలా వుంటే ఈ విషయం తెల్సి తండ్రి ఒళ్ళు హూనం చేస్తాడన్న భయంతో వున్న ఒక్కగాని ఒక్క కొడుకూ కన్పించకుండా పోయి, మరి ఆ యింటి గడప ఆనాటి నుంచి యీనాటి వరకు తొక్కలేదు తన భార్యా, వూళ్ళోవాళ్ళూ, తోటి ఉపాధ్యాయులూ "పోలీసు రిపోర్టు యివ్వమన్నా, ధృఢ నిశ్చయంతో ఆ పని చేసి రచ్చకెక్కటానికి తనకి యిష్టంలేకపోయింది.

ఏ విష వాతావరణంలో తను పెరిగేడో, అలాంటి వాతావరణానికి దూరంగా తన కొడుకుని అన్నివిధాలా తీర్చిదిద్దాలని తనెంతగానో ఆశించాడు. విధి మరోసారి తనని చూచి వెక్కిరించింది తన యీ వైఫల్యానికి మనసులోనే కృంగిపోతూన్న తనని సమాజం మరింత బాధించసాగింది

"వెరీ! సారీ! మేష్టారూ! మీ అబ్బాయి కన్పించాడా!" "ఏంటో పాపం! మీలాంటి ఆదర్శ వుపాధ్యాయుడికి ఎలాంటి కొడుకు పుట్టాడో! పెద్దల నానుడి మీవాడు సార్థకం చేసినట్లున్నాడు."

ఇలా! తన మీద సానుభూతితో కొంతమంది, వృత్తిరీత్యా తన పేరు ప్రఖ్యాతుల మీద ద్వేషం వున్న మరికొంత మంది తోటి వుపాధ్యాయులూ, లోకులూ పలురకాలుగా తనని మాటల్తో వేధిస్తుంటే తట్టుకోలేకపోయాడు తను.

అందుకే వాళ్ళందరకీ దూరంగా వుండాలని, యీ మారుమూల పల్లెలో ప్రాథమిక పాఠశాలకు, అధికారులు తనని విడచి పెట్టటం యిష్టంలేక వద్దంటున్నా బదిలీ చేయించుకుని వచ్చేశాడు. అజ్ఞాతంగా తమశేష జీవితాలను యిక్కడే గడిపేయాలని నిశ్చయించుకున్నారు తనూ, తన భార్యా!

ముప్పై ఏళ్ళుగా తన సంసారం కోసం అహర్నిశలూ చాకిరి చేసి చేసి శారీరకంగా అలసిపోయిన తన భార్యను కొడుకు దూరమయ్యాడన్న దిగులు మరింత కృంగదీసింది దాంతో శరీర రుగ్మతలు ఒక్కొక్కటిగా బయటపడ సాగేయ్! అయినా! లేని ఓపిక తెచ్చుకుని భర్తకి శాయశక్తులా సేవ చేస్తూ తామిద్దరి భుక్తి కోసం చాకిరీ చేయక తప్పలా ఆమెకు.

కాలక్రమేణా తను రిటైరు కావటం, అతికష్టం మీద రిటైరైన మరో నాలుగేళ్ళకు వచ్చిన గ్రాట్యూయిటితో ఆ వూరి పెద్దల సహకారంతో ఓ చిన్నయిల్లు కొనుక్కుని తనూ, తన భార్యా కాలం వెళ్ళబుచ్చున్నారు, నెలానెలా వచ్చే పెన్షనుతో గుట్టుగా సంసారాన్ని ఈడ్చుకొస్తూన్నారు.

రోజులు గడిచే కొద్దీ, వయస్సులు పెరగటంతో బాటు, పాతికేళ్ళ నాడు యిల్లు వదిలి వెళ్ళిపోయిన కొడుకు కోసం ఆరాటం ఎక్కువ కాసాగింది. ఎప్పటికైనా వాడొస్తాడు. తమ కళ్ళబడ్తాడు. యీ పున్నామ నరకం నుంచి తమకి విముక్తి కల్గిస్తాడన్న ఆశతోనే, తామిద్దరూ తమ జీవిత శేషకాలాన్ని నెట్టుకొస్తున్నారు.

ఈవేళ! ఎప్పుడూలేనిది! పెన్షను డబ్బుతో పాటు భార్యకు కొన్న మందు సీసాలు కూడా పోవటంతో యాజులుగారి మనస్సు చివుక్కుమంది. "డబ్బుపోతే పోయె! దానికి మందులెలా" అని వ్యధ చెందుతూన్న యాజులుగారు "కలవరపాడు" అన్న కండక్టరు కేకతో, బస్సు ఒక్కసారిగా కుదుపునిచ్చి ఆగటంతో బాహ్యస్థితిలో కొచ్చి, బస్సుదిగి ఆ రాత్రివేళ అతికష్టంమీద యిల్లు చేరుకున్నారు.

ఆయన కోసం! ఎంత సేపట్నుంచో ఎదురు చూస్తున్న సుగుణమ్మగారు – నలిగిపోయిన దుస్తుల్తో ఆలస్యంగా యిల్లు చేరి ఖిన్నవదనుడై వున్న భర్తను చూచి వుండబట్టలేకపోయింది. భర్తకు మంచినీళ్ళు యిస్తూ–

"ఏమయిందండీ! ఎందుకింత ఆలస్యం చేశారు ఎప్పుడూ లేనిది! ఏమిటీ వాలకం! చెప్పరూ!" ఆతృతతో అడుగుతూన్న భార్యతో అసలు విషయం తెలిస్తే ఆమె మరింత బాధ పడ్తుందనుకొని

"అబ్బే! ఏం లేదు! సుగుణా! పెన్షను రా...లే...దు. ఆఫీసు యిన్స్పెక్షనుట. అందుకని మరో వారానికి కాని రాదు. బస్సు రద్దీలో కాస్త దుస్తులు నలిగేయ్! అంతే!" అంటూ అబద్ధం చెప్పక తప్పలేదు యాజులుగారికి

"పోనీలెండి! యిన్నాళ్ళు బతగ్గ లేంది! యింకో వారం రోజులు బతక్కపోం! ఆ వెంకటేశ్వరస్వామి దయవల్ల మీరింటికి క్షేమంగా వచ్చారు! అదే చాలు! లేవండి! కాస్తంతయినా తిందురుగాని" అంటూ ఆప్యాయంగా లోనకు వెళ్తున్న భార్య వైపు చూస్తూ, తను యింట్లో లేకపోతే అస్సలు తినని తన భార్య వైఖరి గుర్తుకొచ్చి, తనకి తినాలని లేకపోయినా సుగుణమ్మగారి వెనకాలే లోనకి నడవక తప్పలేదు యాజులు గారికి.

* * * * *

సరిగ్గా! నాల్గోరోజు ఉదయం పూజ ముగించుకొని యింటి వసారాలో కూర్చున్న యాజులు గారి చేతిలో ఓ మనియార్డరూ, రిజిస్టర్డు పార్శిలూ అందించాడు అప్పుడే వాళ్ళ యింటి ముందు సైకిలు దిగిన పోస్ట్‌మేన్. ఆ మనియార్డరులో తన పెన్షను మొత్తమంతా వచ్చేసరికి మరింత ఆశ్చర్యంతో పంపిన వారి అడ్రసు చూస్తే, ఎవో కొత్త పేరు కన్పించింది. యాజులు గారు తేరుకునే లోగానే ఎమ్. వో. ఫారం మీద, రిజిస్టర్డు రశీదుల మీనా సంతకాలు పెట్టించుకుని "వస్తా! సార్!" అంటూ సైకిలెక్కిపోయాడు పోస్ట్‌మేన్.

"పోస్ట్‌మేన్" కేకతో వంటింట్లో నుంచి వచ్చిన భార్య చేతిలో డబ్బు పెడుతూ —"సుగుణా! నేను చెప్పలా! మన పెన్షను పంపించారు!" అన్నారు యాజులు మేష్టారుగారు తన ఆశ్చర్యాన్ని అణచి పెట్టుకుంటూ.

"నాకు తెల్సులే! అప్పుడే! ఆ స్వామి వున్నాడు!" అంటూ లోనకి హడావుడిగా వెళ్ళింది సుగుణమ్మ ఆ రంగనాథుల దేవుడికి దండం పెట్టడానికి.

ఆత్రం పట్టలేక, పార్శిలు విప్పిన యాజులుగారి చేతుల్లోకి పట్టుతో తను పోగొట్టుకున్న పెన్షను రికార్డూ, తన భార్యకు కొన్ని మందులూ, చక్కగా చెదరకుండా జాగ్రత్తగా ప్యాకింగు చేసి మరీ పంపించారు ఎవరో పుణ్యాత్ములు. దాంతోపాటు తన పేర ఓ కవరు కూడా వుండటం చూసి మరింత ఆశ్చర్యపోయారు యాజులు మేష్టారు.

తన పేరున్న ఆ ఉత్తరం విప్పి చదువుతూన్న యాజులుగారి ముఖం వివర్ణమై చేతులు వణకసాగినై...

"నా ప్రియమైన మాస్టారుగారికి, అమ్మగారికి నా హృదయపూర్వక నమస్కారములు—

నేను మిమ్మల్ని ఇలా పిలవడానికి తగనేమో! అయినా మీ దయవల్ల మీ కడుపున పుట్టిన వాణ్ణి. ఆనాడే! నేను మీ మాట వినుంటే, యీరోజు సమాజంలో అందరిలానే నేనూ తలెత్తుకుని తిరిగేవాణ్ణి. కాని! నా బుద్ధి వక్రించింది. చదువు సంధ్యలకు బదులు. జూదాలు, ఆటలు వంటపట్టినాయి. ఆ రోజు పరీక్షల్లో కాపీ కొడుతూ పట్టుబడ్డాక, మీకు నా ముఖం చూపించలేక పట్నం వెళ్ళి రైలెక్కేసా! ఆ రైల్లో టికెట్ లేని నన్ను కొట్టి, ఓ అడవి లాంటి స్టేషన్లో అర్ధరాత్రి దింపేశారు టి.సి.

దాంతో! నా కష్టాలు ప్రారంభమయ్యై. అలా!



...లో జరిగిన అఖిల భారత ... పాటలలో ప్రథమ బహుమతి పొందిన శ్రీ ఎ. హెచ్. కృష్ణమూర్తి. హైదరాబాదులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న ఈయన గతంలో 500కి పైగా సంగీత ప్రదర్శనలిచ్చి పలువురి ప్రశంసలందుకున్నారు.





SERVICE CENTRE : A. P. M. INDIA
Challapalli Bungalow
VIJAYAWADA-2.
29 & 30, T.S.R.
Municipal Complex,
VISAKHAPATNAM.
Ritz Hotel Road, HYDERABAD.




★ ఛాంపియన్ లోగో, ఛాంపియన్ అక్షరాల నమూనా, ఆట్టీ ట్రేడ్ మార్కు, మరియు కాపీరైట్ చట్టం క్రింద రిజిష్టర్ చేయబడినవి.

# ఇ'వేమన'పద్యాలు




ఆశయనెడు దాని కోసివేయగలేక
మోస బుద్ధివలన మునిగినారు
కాశివాసులైన గనబోరు మోక్షంబు
విశ్వదాభిరామ వినురవేమ

## "(అ)ప్రయోజకుడు!"

అలా! జేబుల్లో డబ్బులు లేక, మంచినీళ్లే జీవనాధారంగా పల్లె పల్లెలూ తిరిగి, ఎవరైనా పుణ్యాత్ములు పెట్టిన తిండి దొరికినప్పుడు తింటూ, మరో రైలెక్కి ఓ "మహాపట్నం" చేరుకున్నా – అక్కడే ఓ విషవలయంలో చిక్కుకున్నా –అదో పెద్ద ముఠా! వాళ్ళు చేయని, చేయించని చెడ్డపనులంటూ లేవు. వాళ్ల సావాసంలో, జేబులు కొట్టటం, చిన్నచిన్న దొంగతనాలు చేయటం నేర్చుకున్నాను ముట్టినదంతా ఏ రోజు కారోజు వాళ్ల కందజెయ్యాలి. తర్వాత వాళ్లిచ్చే చాలీచాలని డబ్బులో పొట్ట నింపుకోవటం నాలాంటి దౌర్భాగ్యులో బాటు – సాహసించిన వాళ్ల నెదిరించిన రోజు నాకు వళ్ళు హూనమయి పోతూండేది. ఇలా సాగుతున్న నా పాపిష్టి దినచర్యలో ఓ రోజున బ్యాంకి దొంగతనానికి మొదటసారిగా వెళ్లిన నేను పట్టుబడి పదేళ్ళు శిక్షపడి, నెల క్రితం విడుదలై బయటకు వచ్చి చూస్తే ఏముంది మా గేంగు పత్తా లేకుండా ఆ పట్నం నుంచి మకాం మార్చేశారు

అప్పటికి దయామయులైన నా తలితండ్రుల మనస్సులను క్షోభ పెట్టినందుకే నాకి గతి పట్టిందనుకున్నా –మీ యిద్దరి పాదాల మీద పడి, నా కన్నీళ్లతో అభిషేకించాలనుకున్నా కాని మీరు వూరి వదిలి వెళ్లిపోయేరని, ఎక్కడున్నారో తెలియదని చెప్పారు చేసేదిలేక మీ కోసం వెదుకుతూ వెదుకుతూ నాలుగు రోజుల నాడు, పట్నంలో నుంచి బస్సు దిగుతూన్న నాకు అనుకోకుండా చేతి సంచి, నా పాత అలవాటు ప్రకారం నా చేతిలోకి వచ్చింది. ఆ రద్దీలో నేను త్వరగా మాయమయిపోవాల్సి వచ్చింది అందుకే మిమ్మల్నా 'జనసమర్ధంలో తలెత్తి చూడలేకపోయాను

నేను! ఆ సంచి విప్పగానే డబ్బుతో పాటు, మీ పెన్షను రికార్డులో వున్న మీ యిద్దరి ఫోటో, మందు సీసాలు చూచి, నేనెంత "షాక్" తిన్నానో నాకే తెలియదు. చివరికి!- ఏ కొడుకు క్షేమం కోరి, అహర్నిశలూ శ్రమించి పాటుపడ్డ మీ కష్టార్జితాన్ని, యీ విధంగా దోచుకున్న నేను మీ కొడుకును కాను. నాయీ పాపానికి నిష్కృతిలేదు. యీ మానసిక సంక్షోభమే, నాకు కనువిప్పు కలిగించింది నాన్నా!

పుణ్యదంపతులైన మీద్దరకీ తప్ప పుట్టిన, నికృష్టుడ్ని నన్ను క్షమించమని మిమ్మల్ని అడిగే అర్హత కూడా పోగొట్టుకున్న పాపాత్ముడ్ని

అయితే! యీ క్షణం నుంచీ! నాకు జన్మనిచ్చిన మీ యిద్దరి మీదా ప్రమాణం చేసి చెప్తున్నా! ఈ పాపిష్టి జీవితానికి యింతటితో స్వస్తి చెప్తున్నా ఇహ మీద! ఒళ్ళు వొంచి బ్రతికి, నా కాళ్ల మీద నేను నిలబడ్డ గల మరుక్షణం మీ యిద్దరి పాదాల ముందు వాల్తాను. అంతవరకూ?యీ దుర్మార్గపు కొడుకుని మర్చిపొండి.

మీకూ! అమ్మకూ మరోసారి
నమస్సులతో
మీ నిర్భాగ్యపు కొడుకు
"సుకుమార్"

ఆ వుత్తరం చదవటం ముగియగానే, యాజులుగారి కళ్ళు ద్రవించసాగిన్నై. అంతలోనే సంభాళించుకుని –

"ఏమే! యిటు రావే! నీ కొడుకు నుంచి వుత్తరం వచ్చిందే అంటూ యాజులుగారు పెద్దగా కేక వేశారు. దాంతో హడావుడిగా వచ్చింది సుగుణమ్మ అమితమైన వుత్సాహంతో!

"ఏంటండీ! నేను విన్నది నిజమేనా?" నేను చెప్పలా! నా బాబు! ఎప్పటికైనా వస్తాడండి. ఎలా వున్నాడు. వాడెప్పుడొస్తాడు. ఎక్కడున్నాడు త్వరగా చెప్పండి. ప్రశ్నల వర్షం కుర్పిస్తూంటే యాజులుగారికి ఆ వుత్తరంలో సారాంశం ఎలా భార్యకి చెప్పాలో అని ఆలోచిస్తూ, భవిష్యత్తునూహించుకొంటూ ఆ ప్రయత్నంగా యిలా అన్నారు –"సుగుణా! వాడు బానేవున్నాడే! ఉద్యోగ ప్రయత్నాల్లో వున్నాడట. దొరకగానే వచ్చేస్తాడట. మొత్తం మీద వాడూ ప్రయోజకుడవుతున్నాడులే!" ఆమె చూడకుండా కన్నీళ్ళు పైనున్న తువ్వాలుతో తుడుచుకొంటూ □